

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావులను కలిసిన ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, అక్టోబరు 29 ప్రభాతవార్త** రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మంగళవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్థిక మంత్రితో ముచ్చటించారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆర్థిక మంత్రిని ఎమ్మెల్యే కోరారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంట కావలి నియోజకవర్గ టిడిపి లీగల్ సెల్ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, టిడిపి ముఖ్యనేత బుర్లా శ్రీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## భవనాల తనిఖీలో కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 29, ప్రభాతవార్త** : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మార్టిగేజ్ విడుదలకు సంబంధించిన అర్జీల భవనాలను కమిషనర్ సూర్య తేజ మంగళవారం తనిఖీ చేశారు. కార్పొరేషన్ పరిధిలోని జగదీష్ నగర్, చిల్డ్రన్స్ పార్క్ రోడ్డు, పొదలకూరు రోడ్డు, పోలీసు కాలనీ తదితర ప్రాంతాలలో తనఖాలో ఉంచిన మార్టిగేజ్ విడుదల భవనాలకు సంబంధించి అన్ని దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించారు.

## వెలుగొండ ప్రాజెక్టు పరిశీలనలో మంత్రులతో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి





**కందుకూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త** ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు వద్ద జరుగుతున్న ప్రాజెక్టు, ఇతర పనులను ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రకాశం జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ మంత్రి, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పత్రికా సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆధునీకరణ, సోమశీల నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు నీరు ప్రవహించే ఉత్తర కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రిని కోరారు. అలాగే వర్షాధారిత ప్రాంతమైన కందుకూరు నియోజకవర్గంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వెలుగొండ ప్రాజెక్టు జలాలు కందుకూరు నియోజకవర్గ ప్రజలకు చేరేలా చొరువ తీసుకోవాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు

## బిట్రగుంటలో రొటీన్ ఓవర్ హాలింగ్ షెడ్ ఏర్పాటు చేయాలి




**బిట్రగుంట, అక్టోబరు 29 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంటలో సుమారు 700 ఎకరాల రైల్వే స్థలాలు నిరుపయోగంగా వున్న భూములలో ఆర్‌వోహెచ్, పివోహెచ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నురుద్దీన్ డిమాండ్ చేశారు. గత 40 సంవత్సరాల నుండి బిట్రగుంటలో వున్నటువంటి లోకో షెడ్ స్థానంలో ఏదోక రైల్వే పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు జిల్లాకు చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేల వత్తిడి లేకపోవడంతో ఆచరణలో అమలు కాలేదు. తక్షణమే ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం బోగోలు సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ నాయకులు దాసరి సునీల్, బత్తుల రవిచంద్ర, ఎ.కె.మైఖేల్‌రాజ్, ఎస్.కె.అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు బీసీ బాలికల వసతి గృహంలో పనుల ప్రారంభం



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త** : కోవూరులోని సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయ ప్రాంగణంలో ఉన్న బీసీ బాలికల వసతి గృహంలో గత మూడు సంవత్సరా లుగా రెండు అదనపు భవనాల నిర్మాణం ఆగి ఉన్న విషయమై ప్రచురించిన కథనానికి ఎట్టకేలకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు ఈ రెండు అదనపు భవనాల అసంపూర్తి పనులను యుద్ధప్రాతి పదికన ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. దీంతో సంక్షేమాధికారులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. .

## కిడ్నాప్ అయిన బాలుడ్ని 24గంటల్లో ఛేదించిన కావలి పోలీస్

### తల్లికి బిడ్డను అప్పగించడంతో అందరికళ్లు చెమర్చాయి





**కావలి, అక్టోబర్ 29 ప్రభాతవార్త** కావలి పట్టణ వెంగళరావునగర్‌లో కిడ్నాప్‌కు గురైన 15 నెలల తేజాను కావలి పోలీసులు ఛేదించి 24 గంటల్లో తల్లికి బాబును అప్పగించిన వైనమిది. రోదిస్తున్న బిడ్డను ఒక్కసారిగా తల్లి ఆలింగనం చేసుకోవడంతో బాబు ఏడుపుకు స్వస్తి చెప్పడంతో తల్లి,దండ్రుల ఆనందానికి అవధులు లేకుడాపోయాయి. తల్లి,బిడ్డను చూసిన వారి కళ్లు చెమర్చాయి. తల్లిపడ్డ రోదన,ఆవేదన ఒక్కసారి బిడ్డను చూడటంతో కన్నీటిపర్యంతమైంది .ఈ సన్నివేశం కావలి డిఎస్పి కార్యాలయ ఆవరణంలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు జరిగింది. జిల్లా ఎస్పి కృష్ణకాంత్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి రాత్రి 8 గంటల వరకు కావలిలో తిష్టవేశారు. 3 గంటలకు కావలి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న ఓ మహిళను విచారించారు. అక్కడినుంచి బాబు నివాస గృహానికి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. మళ్లి టూటౌన్ పోలీసుస్టేషన్‌కు జిల్లా ఎస్పి పోలీసు అధికారులతో చర్చలు జరిపారు. అక్కడినుంచి కావలి రైల్వేరోడ్డులోని పోలీస్ కంట్రోల్ కమాండెంట్ అతిథి గృహంలో జిల్లా ఎస్పి రాత్రి 8గంటల వరకు తిష్టవేశారు. కిడ్నాప్‌కు గురైన బాలుడి సమాచారం తెలుసుకుని ఆ బాలుడిని కావలికి తీసుకువచ్చేదాక జిల్లా ఎస్పి కృష్ణకాంత్ చేసిన కృషిని అందరూ కొనియాడుతున్నారు. వెంగళరావునగర్ ప్రాంతంలో పలు ఇళ్లల్లో పాచిపనిచేసే పనిమనిషి స్వరూప 15నెలల బాలుడిని కిడ్నాప్ చేసింది. ప్రకాశంజిల్లా మార్కాపురం సమీపంలోని పొన్నలూరు వద్ద పోలీసులు ఛేదించి కిడ్నాప్‌కు గురైన బాబును కిడ్నాప్ చేసిన పనిమనిషిని పట్టుకున్నారు. డిఎస్పి పి.శ్రీధర్ సారధ్యంలో టూటౌన్ సిఐ శ్రీనివాసరావు, ప్రస్తుత బాధ్యతలు స్వీకరించిన గిరిబాబు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు కిడ్నాప్ ఉదాంతాన్ని ఛేదించడంలో విజయం సాధించారు. జిల్లా ఎస్పి కృష్ణకాంత్ ఎంతో ప్రతిష్ఠాకరంగా తీసుకుని కావలిలో 5గంటల పాటు తిష్టవేసి పోలీసులకు పలు సూచనలిచ్చి కిడ్నాప్ సంఘటనను సుఖాంతం చేశారు. దీంతో జిల్లా ఎస్పి కృష్ణకాంత్ సమర్ధతను కావలి ప్రజానీకం ప్రశంసిస్తుంది. కావలి పోలీస్ దక్షతకు ఈ కిడ్నాప్‌ను ఛేదించిన ఉదంతం అద్దం పడుతుంది. శభాష్ కావలి పోలీస్ అన్న ప్రశంశలు అందుకుంది. బాబు తల్లి రాజేశ్వరి, తండ్రి సూర్యనారాయణల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దీంతో పోలీసులు ఊపరిపీల్చుకున్నట్లయింది.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, అక్టోబర్29 ప్రభాత వార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 19,923 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 66.48టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 5, ఎన్‌ఎఫ్‌సికి 300, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరదకాలువకు పదివేలు క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.995మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడానికి ఉల్లాస్ : కలెక్టర్ ఆనంద్




**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 29, ప్రభతవార్త** జిల్లాలోని 18 సంవత్సరాలు దాటిన సుమారు 20 వేల మంది నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులను చేయడానికి ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. ఉల్లాస్ పై ఎంపిడివోలు, ఏపిఎంలకు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశపు హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యులుగా చేయడంలో ఎంపిడిఓలు, వయోజన విద్య ఎపిఓలు పూర్తి సహకారం అందించాలన్నారు. గ్రామాలలో నిరక్షరాస్యులైన స్వయం సహాయ సంఘ సభ్యులు, అంగన్వాడి ఆయాలు, నైట్ వాచ్మన్లు తదితరులను గుర్తించి ఉల్లాస్ కార్యక్రమంలో అక్షరాస్యులుగా చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో జిల్లాలోని నిరక్షరాస్యులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం మాత్రమే కాకుండా 21వ శతాబ్దపు పౌరునికి అవసరమైన క్రిటికల్ లైఫ్ స్కిల్స్ వంటి ఇతర విభాగాలను కూడా అందించడం ఈ పథకం యొక్క లక్ష్యమన్నారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ కూడా తయారు చేస్తారన్నారు. జిల్లాలో 2 మండలాల్లో సదరు యాప్‌ను ప్రయోగాత్మక టెస్ట్ కూడా చేయడం జరిగిందన్నారు. గతంలో జిల్లాలో సాక్షరత భారత్ ద్వారా నిర్లక్ష్యరాస్యతను తగ్గించి, అక్షరాస్యతా శాతం పెంచేందుకు అనేక కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇప్పటి వరకు ఉన్నటువంటి లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 90 శాతం అక్షరాస్యత ఉన్నదని, దానిని వంద శాతం పెంచేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో అమలు చేయుటలో ఎంపిడివోలది కీలక పాత్ర అని, అలాగే జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించుటలో వారి పాత్ర గణనీయంగా ఉంటుందన్నారు. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ఈ సారి డిఆర్‌డిఏను కూడా ప్రభుత్వం భాగస్వామ్యం చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం నవంబర్ మాసంలో రెండు వారాల పాటు నిరక్షరాస్యుల వివరాల కోసం ప్రత్యేక సర్వే నిర్వహించాలన్నారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరిని ఈ సర్వేలో భాగస్వామ్యం చేస్తేనే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. సర్వేకు అమల్లో ఉన్న పథకాలకు ఎటువంటి సంబంధం లేదని కేవలం నిరక్షరాస్యులను గుర్తించడానికి మాత్రమే అని వారిలో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోనే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాను ప్రత్యేక స్థానంలో నిలబెట్టే అవకాశం ఉన్నదన్నారు. సర్వే పూర్తయిన తదుపరి స్వచ్ఛందంగా సేవ చేసే చురుకైన యువతను, రిటైర్డ్ అయిన ఉద్యోగులను, ఆసక్తి గల ఔత్సాహితులను ఎంపిక చేసి శిక్షణ కార్యక్రమాలకు వినియోగించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు.

**గృహాలలో సోలార్ విద్యుత్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసుకోండి** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం గురించి పట్టణాలు, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గృహ అవసరాలకు వినియోగించుకునేందుకు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆసక్తి గల వారిని సంబంధిత వెబ్ సైట్‌లో నమోదు చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్సీడీలు, రుణ సౌకర్యంతో పాటు కొన్నాళ్ల తర్వాత విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ఆదాయం కూడా పొందవచ్చునన్నారు. కావున మండల స్థాయిలో ఎంపిడివోలు వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ప్రజా భాగస్వామ్యం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి హేనా సుజన్, జిల్లాలోని అందరు ఎంపిడిఓలు, డిఆర్‌డిఏ ఏపిఎంలు పాల్గొన్నారు.

## మైనింగ్ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ




**సైదాపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త** మండల పరిధిలోని పెరుమాళ్ళపాడు గ్రామంలో నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనూష ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సమక్షంలో మైనింగ్ అనుమతులపై మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ నాగసంతోషి అనూష మాట్లాడుతూ పెరుమాళ్ళపాడు గ్రామంలోని సర్వే నెంబరు 677/పీ ఓపెన్ కాస్ట్ పద్ధతిలో 6.074 హెక్టార్ల విస్తీర్ణంలో మైనింగ్ నిర్వహించేందుకు జాన్వీఇన్‌ఫ్రా మైన్స్ అండ్ మినరల్ వారు ప్రభుత్వ అనుమతుల కొరకు దరఖాస్తు చేయగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రజల అభిప్రాయాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరుగుతుందని అందుకు అనుగుణంగా మైనింగ్ అనుమతులు ప్రభుత్వం ద్వారా ఇవ్వనున్నట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, తహశీల్దార్ రమాదేవి, మైన్ యాజమాన్యం నితిన్, ఎన్జీవోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దక్షిణ కాల్వ పనులు పూర్తిపై దృష్టి : ఎమ్మెల్యే సోమిరెడ్డి



**పొదలకూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం నుంచి అటవీ శాఖ అనుమతులు లభించక గత 25 ఏళ్ల నుండి అసంపూర్తిగా ఉన్న దక్షిణ కాలువ పనులను తక్షణం పూర్తి చేసేందుకు దృష్టిని కేంద్రీకరించామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పొదలకూరు మండలంలోని అమ్మవారిపాల్యెం వద్ద అసంపూర్తిగా ఉన్న దక్షిణ కాల్వను ఆయన ఇరిగేషన్ అధికారులు, ఫారెస్టు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామంలో రైతులు, నాయకులు, అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల నుంచి కేవలం ఫారెస్టు అనుమతులు లేకుండా సాధించే నాయకులు పట్టించుకున్న ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఈ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, దీని వల్ల త్రాగు, సాగు నీరుకి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఈ కాలువ పనులు పూర్తి అయితే ప్రత్యేక్షంగా 4 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని దీంతో పాటు పశుపక్షాదులకు నీరు దొరుకుతుందని ఆయన తెలిపారు. ఇందుకోసం అటవి అధికారుల అనుమతులు లభించకపోయినా పట్టా భూముల్లో కాలువ నిర్మాణాన్ని మళ్లించి రైతుల కోసం వారి అభివృద్ధి కోసం తాను సొంతంగా 10 లక్షల రూపాయిలు కాలువ నిర్మాణానికి ఇస్తున్నానని అలాగే 2 వేల ఎకరాల వరకు ఉన్న రైతులు సహకారంతో దాతల దాతృత్వంతో సుమారు 80 లక్షల రూపాయిలు వ్యాయంతో త్వరితగతిన దక్షిణ కాలువ పనులు పూర్తి చేసి 4 వేల ఎకరాలు సాగుకి నీరు అందించేందుకు తక్షణ చర్యలకు ఉపక్రమించామని ఆయన తెలిపారు. ఇందు కోసం ఆయా గ్రామాల రైతులతో గ్రామ నాయకులతో చర్చిస్తున్నామని సహృదయం గల దాతలు ముందుకు వస్తున్నారని ఇది శుభ పరిణామమని దక్షిణ కాలువ పనుల నిర్మాణం పూర్తి అవ్వడానికి సమయం ఆసన్నమైందని సంతోషపడుతున్నామ న్నారు. పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వచ్చే నెల 15వ తేదిన దయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పొదలకూరు రాపూరు కలువాయి చేజర్ల సైదాపురం మనుబోలు మండలాల వారికి ఇక్కడే దయాలసిస్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రోజుకు 26 మందికి ఈ దయాలసిస్ కేంద్రంలో దయాలసిస్ చేయవచ్చునని తెలిపారు. ప్రస్తుతం సోమశిలలో 67 టీఎంసిలు కండలేరులో 43 టీఎంసిలు నీరు ఉందని మరో 15, 20 రోజుల్లో మరో 15 టిఎంసిలు మీరు చేరే అవకాశం ఉందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. పొదలకూరు మండల టిడిపి అధ్యక్షులు తలచూరు మస్తాన్ బాబు బక్కయ్య నాయుడు, జమీర్ కార్యకర్తలు రైతులు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల త్యాగాలపై సెమినార్






**నెల్లూరు క్రైం, అక్టోబర్ 29, ప్రభాతవార్త** జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం విద్యార్థినీ విద్యార్థులకు పోలీసులు త్యాగాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఎటువంటి సమస్య, విపత్కర పరిస్థితులు వచ్చినా మొదటి గుర్తు వచ్చేది పోలీసేనని, పోలీసు విధి నిర్వహణ శ్రమతో కూడుకున్నదని అన్నారు. సమసమాజం కోసం, ప్రజా రక్షణ కొరకు అహర్నిశలు నిర్వహణలో శ్రమించే పోలీసులు త్యాగాలను ఎన్నటికీ అందరం గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో పోలీసుల పాత్ర, నిధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన కలిగి ఉంటే తద్వారా పోలీసులపై గౌవం పెరుగుతదని తెలిపారు. యువత గంజాయి తదితర మత్తు వ్యసనాలకు దూరంగా ఉండాలని సరదాగా ప్రారంభమై జీవితాన్ని సర్వనాశనం చేస్తుందని అన్నారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణ, మాన, ధనాన్ని కాపాడుటలో, శాంతిభద్రతల పరిరక్షణ, ఉగ్రవాద, తీవ్రవాద చర్యలు అరికట్టుటలో పోలీసుల పాత్ర ఆమోఘమని కొనియాడారు. యువత పోలీసు శాఖ వైపు ఆసక్తి చూపాలని సూచించారు. టౌన్ డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ యువత ప్రేమ పేరుతో మోసపోవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి ఇవ్వద్దని, తల్లిదండ్రులను తప్ప అనామకులను నమ్మవద్దని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కొందరు విద్యార్ధులు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కొరకు పోలీసులు చేస్తున్న త్యాగాలను గురించి తెలియజేస్తూ, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి వెంకటేశ్వర రావు, డిటిసి డిఎస్పి గిరిధర్, డిటిసి సిఐ నాగేశ్వరమ్మ, ఎస్‌బి 2 సిఐ బి. శ్రీనివాస రెడ్డి, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐ హెచ్‌జి థామస్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, పలు కళాశాల విద్యార్ధులు పాల్గొన్నారు.

## పక్షవాతాన్ని జయించవచ్చు : అపోలోలో ఉచిత వైద్య శిబిరం



**నెల్లూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త–వైద్యం** పక్షవాతం వచ్చినప్పుడు ప్రతి నిముషం ఎంతో విలువైందని, ఎంత త్వరగా రోగిని వైద్యుని దగ్గరకు తీసుకెళ్తే అంత త్వరగా పక్షవాతాన్ని నయం చేయవచ్చని అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందు మీనన్, ఆ హాస్పిటల్ డైరక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ అన్నారు. ప్రపంచ స్ట్రోక్ డేను పురస్కరించుకుని మంగళవారం అపోలో హాస్పిటల్‌లో ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా పలువురికి ఉచిత పరీక్షలను నిర్వహించారు. అలాగే స్ట్రోక్ రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఒక వేళ స్ట్రోక్ వస్తే ఎంత సమయంలోపు వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి అనే తదితర అంశాలను డాక్టర్ బిందు మీనన్, ఇతర వైద్య బృందం.. హాజరైన వారికి తెలియజేశారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో స్ట్రోక్‌కు గురైన రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయనే విషయాలను కూడా వివరించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన అవగాహన కార్యక్రమలో డాక్టర్ బొందు మీనన్, డాక్టర్ శ్రీరాం సతీష్ స్ట్రోక్(పక్షవాతం) గురించి మాట్లాడారు. పక్షవాతం పెను ఉత్పాతం అని, మెదడులో సునామీగా విరుచుకుపడి, చెట్టంత మనిషిని సైతం కుప్పకూలుస్తుందని హెచ్చరించారు. పక్షవాతం భారిన పడితే శరీరంలో సగం భాగం చచ్చుపడిపోతుందని, కాలు చేయి ఆడదని, నోట మాట రాదని, మొత్తంగా ఆ మనిషి అనుభవించే దురవస్థకు అంతే ఉండదని తెలిపారు. సమాజంలో అధిక సంఖ్యలో ప్రజలను వికలాంగులుకు మారుస్తున్న అతి పెద్ద సమస్య పక్షవాతం అని తెలియజేశారు .మెదడులో ఉన్నట్టుండి రక్తనాళాలు పూడుకుపోయి, కొంత భాగానికి రక్త సరఫరా నిలిచిపోతే ఆ భాగం చచ్చుబడిపోతుందని దాని కారణంగా మనిషి స్ట్రోక్‌కు గురౌవుతాడని వెల్లడించారు. ఆ సమయంలో రోగిని ఎంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకెళ్తే అంత త్వరగా పక్షవాతం నయమవుతుందని చెప్పారు. పక్షవాతానికి గురైనప్పుడు ప్రతి నిమిషం ఎంతో కీలకమైందని, సకాలంలో వైద్యుని వద్దకు తీసుకెళ్లి వైద్యం అందిస్తే పూర్తిగా కోలుకోవచ్చని పేర్కొన్నారు. బీపీ భాగా పెరగడం, ఊపరి సరిగ్గా తీసుకోకపోవడం, వాంతులు అవుతున్నట్లు ఉండటం, ఇవ్వన్నీపక్షవాతం రావడానికి ముందు కనిపించే సంకేతాలని వైద్యులు తెలియజేశారు. హై బీపీ, దూమపానం, మద్యపానం, హై షుగర్ ఉన్న వాళ్లకు స్ట్రోక్ సంభవించే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్య సేవలతో పాటు ఆధునిక వైద్య పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయని తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు న్యూరాలజీ వైద్యులు డాక్టర్ రష్మీ, డాక్టర్ శివశంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబంలో భగవద్గీత ఉండాలి రాజరాజేశ్వరనందస్వామి



**సంగం అక్టోబర్ 29 ప్రభాతవార్త :** భగవద్గీత అంటే మృతి చెందిన వారి వద్ద ఉంచే క్యాసెట్ కాదని రాజరాజేశ్వరనందస్వామి తెలిపారు. మండలకేంద్రమైన రాజరాజేశ్వనంద ఆశ్రమంలో ఆయన భక్తుల నుద్దేశించి మాట్లాడుతు భగవద్గీత అంటే మతం కాదని జ్ఞానం అని అన్నారు. ప్రతి కుటుంబంలో భగవద్గీత ఉండాలని దానిని తప్పకుండా చదవాలని ఆయన కోరారు. పాశ్చాత్య దేశాలలో మేదావులు సైతం భగవద్గీత గురించి గొప్పగా చెప్పారని ఆయన తెలిపారు. భగవద్గీత అంటే మతం కాదం జ్ఞానం అనిచెప్పారు. భగవద్గీత అంటే మతం కాదు ధర్మం, భగవద్గీత అంటే ఉత్తమ జీవనవిధానం మార్గం అని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరు భగవద్గీత చదవాలని ఆయన కోరారు.

## కిడ్నాప్‌కు గురైన బాలుడును తల్లి చెంతకు చేరుస్తున్నాం ! జిల్లా ఎస్పీ,డిఎస్పీ, సిఐలకు ప్రత్యేక అభినందనలు !!



**కావలి, అక్టోబరు 29 ప్రభాతవార్త :** కావలి పట్టణ వెంగళరావునగర్‌లో కిడ్నాప్‌కు గురైన బాలుడు తేజను తల్లి చెంతకు చేరుస్తున్నామని 24 గంటల్లో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, డిఎస్పీ శ్రీధర్, సిఐలు చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి బాలుడి నివాసానికి ఎమ్మెల్యే వెళ్లారు. బిడ్డ కోసం రోదిస్తూ తపనపడుతున్న తల్లి రాజేశ్వరి ఊరట చెందేలా శుభవార్త చెప్పడం జరిగిందన్నారు. తాను ఈ రోజు విజయవాడకు వెళ్లడం జరిగిందన్నారు. ప్రతి నిమిషం కిడ్నాప్‌కు గురైన బాలుడు విషయంలో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్నానన్నారు. కిడ్నాప్‌కు గురైన బాలుడుని 24 గంటల్లో పోలీసులు చేధించడం, బాలుడిని భద్రంగా తీసుకురావడం తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే సాధ్యమైందన్నారు. కావలి నియోజకవర్గంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో వుండేందుకు పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. బాలుడు కథ సుఖాంతం కావడంతో తనకెంతో సంతోషంగా వుందన్నారు. ప్రతి ఒక్కరు ఇళ్ళ ముందు సిసి కెమెరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలి.కావలి ప్రాంతంలో ప్రతి ఒక్కరు తమ ఇళ్ల ముందు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కోట్లాది రూపాయలు ఇళ్లు కట్టించుకుని భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రోజు వెంగళరావునగర్ బాలుడి కిడ్నాప్ సిసి కెమెరాల ద్వారానే నిందితుల్ని గుర్తించి పట్టుకోవడం జరిగిందన్నారు. చెడ్డ పనులు చేసే వారిని అడ్డుకోవాలంటే సిసి కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కావలిలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల సిసి కెమెరాలకు చెల్లించాల్సి న డబ్బులు చెల్లించలేదన్నారు.మన తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో సోలార్, వైఫై ద్వారా సిసి కెమెరాలను ఏర్పాటు చేసే ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కావలిని కాపు కాయడమే తన లక్ష్యం, ధ్యేయమన్నారు. చింతాకు సమస్య వచ్చినా తాను వున్నానన్నారు. అన్ని ప్రభు త్వమే చేయాలన్న ఆలోచన నుంచి బయటకు రావాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో సిసి కెమెరాల వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రజల తోడ్పాటు వుంటేనే ఈ వ్యవస్థలను బలోపేతం చేయగలమని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్ట ణంలోని ప్రధాన కూడళ్లలో, జనసాంద్రత ఎక్కువుగా సంచరించే ప్రాంతాలలో సిసి కెమెరాల వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు.

## గ్రంధాలయానికి స్థలాన్ని మంజూరు చేయాలి



**కావలి రూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** కావలి పట్టణం వెంగళరావునగర్‌లోని ప్రభుత్వ శాఖ గ్రంధాలయానికి స్థలాన్ని మంజూరు చేయాలని సామాజిక వేత్త యం.మాలకొండారెడ్డి తెలిపారు. కావలి ఆర్డీవో వంశీకృష్ణను ఈ విషయమై కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుండి ప్రభుత్వ శాఖ గ్రంధాలయానికి కావలి పట్టణంలో శాశ్విత భవనం లేక అద్దె భవనంలో నడుపుతున్నారని తెలిపారు. తరచుగా గ్రంధాలయ భవన యజమానులు ఖాళీ చేయించడం ద్వారా వివిధ ప్రాంతాలకు గ్రంధాలయాన్ని మారుస్తుండటంతో పాఠకులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.ప్రస్తుతం వెంగళరావునగర్‌లో అద్దె భవనంలో గ్రంధాలయాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రంధాలయ భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

## ఇందుకూరుపేట, జంగంవానిదొరువు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**ఇందుకూరుపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని ఇందుకూరుపేట, జంగంవానిదొరువు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ ఏ.రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఆర్ఎన్ఆర్-15048 పోసుకునే రైతులు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపల మాత్రమే నారు, నాట్లు వేసుకోవాలని తెలిపారు. ఇలా నాట్లు వేసుకోవడం వల్ల త్వరగా వెన్ను తీయకుండా సకాలంలో వెన్ను తీసి, దిగుబడి ఇస్తుంది. నవంబర్ నెల నుంచి ఎన్ఎల్ఆర్-34449, కేఎన్ఎం-1638 అనుకూలంగా ఉంటాయని రైతులకు తెలియజేశారు. ఎంఏఓ డి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ నారుమడిని పొలంలో ఎత్తైన ప్రదేశంలో పోసుకోవాలని, ఒక కేజీ విత్తనానికి ఒక గ్రామ కార్బండిజం కలిపి విత్తన శుద్ధి నిర్వహించుకోవాలని తెలియజేశారు. చివరి దుక్కిలో నారు పోసుకోవాలన్నారు. నారు పోసుకున్న 15 రోజుల లోపల 2.7 కిలో గ్రాములు యూరియా, 6.25 కిలో గ్రాములు సింగిల్ సూపర్ ఫాస్పేట్, 1.67 కిలో గ్రాములు పొటాస్ వేసుకోవాలని తెలియజేశారు. కలుపు నివారణక కోసం ఒక లీటర్ నీటికి 2.5 ఎంఎల్ క్లోరిఫైరిపాస్ కానీ లేదా 1.5 గ్రాములు ఎసిపేట్ ఒక లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేయాలన్నారు. ఈ చలి కాలంలో అగ్గి తెగులు రాకుండా ఒక లీటరు నీటికి 0.6 గ్రాములు ట్రైసైక్లోజోల్ కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు జింకు నివారణ కొరకు ఒక లీటరు నీటికి 2 గ్రాములు జింక్ సల్ఫేట్ కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ దీక్షిత, రైతులు పాల్గొన్నారు.

## డీఎం కండ్రికలో వైద్యశిబిరం



**ఇందుకూరుపేట, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలం జగదేవిపేట పీహెచ్‌సీ పరిదిలోని డీఎం కండ్రిక నందు 104, వైద్యశిబిరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి.కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్యం బాగాలేక చూపించుకొనుటకు వచ్చిన వారికి డాక్టర్ కిషోర్ కుమార్ పరీక్షించి, అవసరమైన వారికి బీపీ, షుగర్, హెచ్‌బీ , జ్వరం, రక్త పరీక్షలు జరిపి మందులు ఇవ్వడం జరిగింది. గర్భవతులకు, ప్రత్యేకంగా హైట్, వెయిట్, షుగర్, బీపీ, పరీక్షలు జరిపి ఐరన్, పోలిక్ యాసిడ్, కాల్షియం మాత్రలు అందజేయడం జరిగింది. దీర్ఘకాలంగా నడవలేని, మంచానికే పరిమితమైన వారి ఇంటికి డాక్టర్ సిబ్బంది వెళ్లి చూసి అవసరమైన మందులు ఇవ్వడం జరిగింది. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.కిషోర్ కుమార్, ఎంఎల్ హెచ్‌పీ నందిని, ఏఎన్ఎం కే.శ్రీకల్పవల్లి, హెల్త్ అసిస్టెంట్ బి.మాధవ, ఆశా కాక్యకర్త హైమావతి, 104 సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## యనమదలలో పొలం పిలుస్తుంది పై అవగాహన



**చేజర్ల అక్టోబర్ 29 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని యనమదల చిత్తలూరు గ్రామాల లో పొలం పిలుస్తోంది కార్యమ్రాన్ని మండల వ్యవసాయాధికారి శశిదర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయా గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం శశిదర్ మాట్లాడుతు వ్యవసాయశాఖ వాటి అనుబంధ శాఖలపై అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.ప్రతి మంగళవారం,బుధవారం పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి సూచనలు సలహాలు అందిస్తారని తెలియజేశారు. వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. నారుమడులు ,రైతులు ఎప్పుడు వేసుకోవాలో యాజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. అనువైన వరి విత్తనాలు కెఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్15048 నవంబర్ నెల 15 నుండి డిసెంబర్ 15 వ తేది లోపు రైతులు నారు పోసుకుంటే మంచి దిగుబడులు వచ్చి రైతులకి అధిక లాభం చేకూరుతుందని తెలియజేశారు. వరి రాయితీ విత్తనాల కోసం రైతులు రైతు సేవా కేంద్రాలలో రిజిష్టేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

## మోపాడు, మాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**కందుకూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** కందుకూరు మండలంలోని మోపాడు, మాచవరం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాము మాట్లాడుతూ వరిలో నేరుగా విత్తే సాలు వరి పద్ధతిని పాటించడం ద్వారా నారు పెంచే అవసరం లేకుండా వరి పండించుకోవచ్చని తద్వా రా కూలీలు, నారు నాటే ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు ఎక్కువగా వరి రకం కేఎన్ఎం 1638 వేసే దానికి మొగ్గుచూపుతున్నారు. కావున ఎకరాకు 20-2.5 కేజీల సరిపోతుందని విత్తే ముందు కిలో విత్తనానికి 2 గ్రాములు కార్బండిజమ్ మందుతో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా పంటలను పరిశీలించి తెగుళ్ళనివారణకు తీసుకోవాలని సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయాధికారి డి.ధనమ్మ మాట్లాడుతూ భీజామృతంతో విత్తన శుద్ధి లేదా నారుశుద్ధి చేసుకుంటే తెగుళ్ళ నుండి కాపాడుకోవచ్చన్నారు. వ్యవసాయ మార్కెట్ అధికారి షేక్ కాశిం, రెండు గ్రామాల వ్యవసాయ సహాయకులు ఇ.రమ ణయ్య, సీహెచ్ రోని రేచల్, పశువైద్యఅసిస్టెంట్లు ఎస్.ప్రశాంతి, పి.విజయ, మోపాడు గ్రామ పెద్దలు రావుల రవి, తోకల సుబ్రహ్మణ్యం, రైతులు, మాచవరం గ్రామ పెద్దలు సూరం చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

## కృష్ణాపురంలో గ్రామసభ



**ఉలవపాడు, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే గ్రామసభ కార్యక్రమం నిర్వహించామని సర్పంచ్ మందాడి సుశీలమ్మ పేర్కొన్నారు. ఉలవపాడు మండలం కృష్ణా పురం గ్రామంలో మంగళవారం గ్రామసభ కార్య క్రమానికి ముఖ్య అతిధిగా తహశీల్దార్ లావణ్య పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామా ల్లో ఉన్న ప్రజల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేందుకే ఈ గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కారం చేయించుకోవాలని కోరారు. ప్రజల నుండి 18 అర్జీలు అందాయి. గృహ నిర్మాణం, విద్యుత్ లైన్లు, రోడ్లకు మరమ్మత్తులు, పొలం సర్వే నెంబర్లు మార్పులు వంటి సమస్యలను అర్జీల రూపంలో ప్రజలు తహశీల్దార్‌కు అందించారు. వీటిపై స్పందించిన ఆమె వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

## రక్తదాన శిబిరంలో తెలుగు తమ్ముళ్లు



**ఉదయగిరి, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పా టు చేసిన రక్తదాన శిబిరంలో తెలు గు తమ్ముళ్లు మేము సైతం అంటూ ముందుకొచ్చి రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి మండల కన్వీనర్ చింతబోయిన బయన్న యాదవ్ కుమారుడు చింతబోయిన శివకృష్ణ మాట్లాడుతూ ఉదయగిరి పోలీస్ శాఖ కు చెందిన అధికారులు సీఐ వెంకట్రావు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి పిలుపు మేరకు తెలుగు తమ్ముళ్ల రక్తదాన శిబిరంలో పాల్గొనడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జమ్మలమడుగు రమేష్ జల్సా ఎస్వి చింతల రమేష్ తదితరులు పాల్గొనడం జరిగిందని అన్నారు.సమాజానికి ఉపయోగపడే రక్తదాన శిబిరం లాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జమ్మలమడుగు రమేష్ మాట్లాడుతూ యువకులుగా సమాజ బాధ్యత తమపై ఉందని సామాజానికి ఉపయోగపడే రాజకీయాలే కాకుండా సమాజ సేవ కూడా చేసే విధంగా ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఎలాంటి సమాసజేవా కార్యక్రమాలకైనా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొంటారని అన్నారు.తమ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ సమాజంలో గౌరవం కలిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా తమ నాయకుడికి తమ పార్టీకి పేరు ప్రతిష్టలు తెచ్చే విధంగా తమ యువకుల నడవడిక ఉంటుందని ఆ విధంగా తమ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రతి కార్యకర్తకు దిశా నిర్దేశం చేశారని అన్నారు.ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తాన్ని దానమిచ్చి పలువురి ప్రాణాలను నిలబెట్టే విధంగా తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పెద్దాసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌కి అధునాతన వైద్యం




**నెల్లూరు, అక్టోబర్ 29, ప్రభాత వార్త-వైద్యం :** ప్రభుత్వ పెద్దాసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌కి అధునాతన వైద్య సేవలం దిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురష్కరించుకుని మం గళవారం దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ కళాశాల, ప్రసూతి ఆసుపత్రి నుంచి మెయిన్ రోడ్డులోని పరసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులు న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవన విధానం, జంక్‌ఫుడ్ తీసుకోవడం, బీపీ, షుగర్ అదుపులో లేకపోవడం, ఆల్కహాలు తీసుకోవడం, శీతల పానియాలు తీసుకోవడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందన్నారు. అవగాహన పెంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా స్ట్రోక్ వల్ల వచ్చే పక్షవాతం తద్వారా కలిగే వికలాంగత్వమన్నారు. సోర్ వల్ల మెదడులో ఒక్కో వహరక్తం కారుతుందన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. అందువల్ల స్ట్రోక్‌కు గురైన వారిని మొదటి నాలుగున్నర గంటలలో ఆసుపత్రికి తీసుకెళ్తే వైద్యం ద్వారా బ్రతికించుకోవచ్చన్నారు. పెద్దాసుపత్రిలో స్ట్రోక్ గురైన గోల్డెన్ అవర్ వేసే రూ.10వేల దైన సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. అధునాతన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు, కళాశాల ప్రిన్సిపాల్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాజ్, జనరల్ ఫీజిషియన్‌విభాగం డాక్టర్లు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షితాయి హుండి లెక్కింపు



**బుచ్చి అక్టోబర్ 29 ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం హుండి లెక్కింపు మంగళవారం నిర్వహిం చారు. దేవాదా య,ధర్మాదాయశాఖ అధికారులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి సమక్షంలో హుండి లెక్కి ంపు నిర్వహించారు. 04.09. 2024 నుండి 29.10.2024 వరకు అనగా 56 రోజులకు శ్రీవార్ల ప్రధాన ఆలయ హుండిలు ద్వారా 2818925, అన్నదానం హుండిల క్కింపు 158863,కాగా 88 గ్రాములు 870 మిల్లి గ్రాములు,వెండి వస్తువులు 128 గ్రాములు,యూఎస్ఏ డాలర్లు 11 సమర్పించారు. జిల్లా దేవదాయశాఖాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆర్ కృష్ణ చైతన్య,ఇనస్పెక్టర్ దేవాదాయశాఖ కోవూరు, దేవస్థాన సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఆర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, స్థానిక ఏపిజిబి బ్యాంకు అధికారులు,ఆలయ సిబ్బంది, విద్యాసాగర్ కృష్ణ ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్‌ఇండియా రిటైర్డ్‌ఉద్యోగులు,రెవిన్యూ అధికారులు,పోలీస్‌అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## బియ్యం ఎగుమతులకు కృషపట్నం పోర్ట్ వారు అవకాశం కల్పించాలి



**నెల్లూరు కార్పొరేషన్,అక్టోబర్ 29,ప్రభాతవార్త:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం ఆదాని కృష్ణపట్నం పోర్టు కంటైనర్ల ద్వారా బియ్యం ఎగుమతులకు అవకాశం కల్పించాలని మంగళవారం స్థానిక నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్ నందు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నెల్లూరు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించి కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఈ సంవత్సరం వర్షాలు బాగా వీపరీతంగా పడే అవకాశం ఉంది.అయితే పంటలు బాగా పండినప్పుడు బియ్యం కూడా ఎక్కువగా తయారు అవుతాయి.కావున సదరు నెల్లూరు జిల్లాలో పండిన వరి బియ్యం ఇతక దేశములకు కృష్ణపట్నం పోర్టు ద్వారా మేము పంపదలచు కుంటున్నామని తెలిపారు .కృష్ణపట్నం పోర్టు వారు కంటైనర్ ద్వారా మాకు ఎగుమతులకు అవకాశం కల్పించాలని కోరారు.గత సంవత్సరంలో పచ్చి బియ్యానికి ఉప్పుడు బియ్యానికి అనేకమైనటువంటి ఆంక్షలు,పన్నులు ఉండేవి ప్రస్తుతము కేంద్ర ప్రభుత్వం వారు బియ్యం పై ఆంక్షలను పన్నలను తీసివేసిసారని వివరించారు.నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి కృష్ణపట్నం పోర్టు ద్వారా బియ్యము పంపాల్సిన ఆవశ్యము ఏర్పడుతున్నదని పేర్కొన్నారు.ప్రస్తుతము ఎక్కడో సుదూరానున్న చెన్నై తూత్తుకుడి పోర్టుల ద్వారా బియ్యము పంపిస్తున్నామన్నారు.ఇది చాలా వ్యయ ప్రయాసలతో కూడిన పనిగా ఉన్నది అన్నారు.అందువలన సుదూర ప్రాంతమునకు రవాణా చేయదలిస్తే ఖర్చులు విపరీతంగా పెరుగుతాయని తెలియజేశారు.ఇవన్నీ రైతుల మీద భారము పడుతున్నదున నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి కృష్ణపట్నం పోర్టు ద్వారా బియ్యం ఎగుమతులకు అనుమతి ఇవ్వవలసిందిగా ఆదాని పోర్టు వారిని కోరారు.ఈ కార్యక్రమంలో వేలమూరి రంగయ్య నాయుడు,మునగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వంతోపాటూ స్వచ్ఛంద సంస్థలుకూడా ముందుకురావాలి




**నెల్లూరు,అక్టోబరు29 ప్రభాతవార్త-విద్య :** బాధితులు ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటూ స్వచ్ఛంద సంస్థలు కూడా ముం దుకు రావాలని సెట్నల్ సిఈఓ శ్రీని వాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని స్థానిక కొండాయపాలెం లోని అబైండింగ్ హోప్‌ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో సలహా ఇవ్వటం చాల తేలికైన పని అని, సహాయం చేయటం కష్టమన్నారు. ట్రస్టు చైర్మన్ నిర మల్‌కుమార్ గత మూడు సంవత్సరాల నిండి రూ.1500 విలువైన న్యూట్రీషన్ ఆహారాన్ని 200మందికి పైగా అందించటం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వం వారికి మందులను ఉచితంగా అందించటం జరిగిందని తెలిపారు. పేదలకు , అభాగ్యులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాధితులకు బలవర్ధకమైన ఆహారాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ నిర మల్‌కుమార్, జయప్రకాష్, ఉషాకిరణ్, మరియమ్మ, తంబురాజు, క్రాంతి కుమార్, డేవిడ్ లివింగ్‌స్టన్, రూట్ బినామీ, శశిదేవి, తదితరులు పాల్గొన్నారు.

## రావూస్‌లో ఘనంగా క్లబ్‌ఫెస్ట్-24




**నెల్లూరు,అక్టోబరు29 ప్రభాతవార్త-విద్య :** నగరంలోని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం క్లబ్‌ఫెస్ట్-24ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా రావూస్ విద్యాసంస్థల డైరెక్టర వై.శివసంకేత్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకశక్తి, సాంకేతికతలను బయటకు తీసుకువచ్చేందుకు ఈ ఫెస్ట్ ఎంతగానో ఉపకరిస్తుందన్నారు.ఇందులో సుమారు విద్యార్థులు ఎడిటింగ్,ఏఐ, ట్రావెల్,ఫ్యాషన్,సినిమా, పెయింటింగ్, మేనేజ్‌మెంట్,క్రికెట్ వంటి 47 క్లబ్‌లను ఏర్పాటుచేయటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏడు ఈ ఫెస్ట్‌ను తమ విద్యాసంస్థల చైర్మన్ వై.కోటేశ్వరావు ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం అన్నీ క్లబ్‌లను పరిశీలించి క్లబ్ సభ్యులకు ప్రశంశా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిఈఓ ఎన్.శివారెడ్డి, ప్రిన్సిపాల్ షరీఫ్, డీన్ సుందర్ , అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలోవినియోగదారులకు నాణ్యమైన సేవలు

**నేటి నుంచి ఉచిత సిలిండర్ల బుకింగ్ ప్రారంభం**
**సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించనున్నాం**
**తెల్ల రేషన్ కార్డు దారులందరూ అర్హులే ..రైతు బజార్లలో చౌకగా వంట నూనెలు**
**రేషన్ షాపుల్లో కిలో కందిపప్పు రూ. 67లకే**
**చౌకదుకాణాలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించం**
**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి**



**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 29, ప్రభాతవార్త** మంగళవారం హరినాథపురంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రధానంగా పౌర సరఫరాల శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ప్రారంభించడం జరిగిందన్నారు. సంవత్సరానికి మూడు సిలిండర్లను ఉచితంగా అందిస్తామన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన సరుకుల పంపిణీ లక్ష్యంగా పనిచేస్తున్నది. ఇందులో భాగంగా ఎన్నికల హామీల్లో సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్‌లను అందించడం జరుగు తుంది. అర్హత కలిగిన తెల్లరేషన్ కార్డుదారులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి సిలిండర్ ఈ నెల 31వ తారీకు నుండి మార్చి నెలాఖరులోగా అలాగే రెండు సిలిండర్ ఏప్రిల్ ఒకటి నుండి జులై నెలాఖరులోగా మూడు సిలిండర్ ఆగస్టు, ఒకటి నుండి నవంబర్ 30 లోగా బుక్ చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ఉచిత గ్యాస్ సిలిండర్‌లను నేటి నుండి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా అందిస్తున్న ఉచిత బియ్యం పథకాన్ని కొనసాగిస్తూ వాటిలో కొంత మేర జొన్నలు తీసుకునే వెసులబాటును కల్పించడం జరిగింది. గత వైసిపి ప్రభుత్వం నిత్యవసరాల సరుకుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహించింది అన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం అందించిన ఉచిత బియ్యాన్ని మాత్రమే వినియోగదారులకు అందించారని మిగిలిన నిత్యవసర సరుకులను నిలిపివే శా రన్నారు. చౌక దుకాణాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నవం బర్ 1 నుండి రేషన్ షాపుల్లో తెల్ల రేషన్ కార్డుదారులకు నాణ్యమైన అవసరాలను అతి తక్కువ ధరలకే అందించేందుకు సంకల్పించామని తెలిపారు. వీటిలో బియ్యం బదులుగా మూడు కిలోల జొన్నలను తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. బహిరంగ మార్కెట్‌లో 175 రూపాయిలుగా ఉన్న కందిపప్పును కేవలం 4 రూపాయిలకే కూటమి ప్రభుత్వం అందిస్తుంది. అలాగే వంట నూనెల్లో 125 రూపాయిలు ఉన్న పామాయిల్‌ను మన ప్రభుత్వం రైతు బజార్లలో 110 రూపాయిలకే అందిస్తుందని అలాగే సన్‌ఫ్లవర్ ఆయిల్ 140 రూపాయిలుగా ఉండగా తగ్గించి 124 రూపాయిలకే సరఫరా చేస్తున్నామని తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎల్ఎల్ నరసింహారావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## వరి విత్తనాల దుకాణాలు తనిఖీ



**బిట్రగుంట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** బోగోలు మండలంలోని జక్కేపల్లిగూడూరు, ఎబికండ్రిక, బోగోలులోని వరి విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయాధికారిణి ఎస్.విజయలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్ పరిశీలించి నాణ్యమైన విత్తనాల్ని విక్రయించాలని రైతులు విత్తనాలు కొలుచేసేటప్పుడు తప్పసరిగా రసీదు పొందాలని ఆమె సూచించారు.

## పందుల పెంపకం దారులకు శాశ్వత పునరావాసం

### ఏర్పాటు చేయాలి సిపిఎం నాయకుల డిమాండ్



**బుచ్చి అక్టోబర్ 29 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పందుల పెంపకం దారులకు శాశ్వత పునరావాసం ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు ముత్యాల గురునాధం, చల్లకొలుసు మల్లికార్జున, షేక్ జానీభాషా డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు పందుల పెంపక దారులను ఖాళీ చేయించలన్నా నిర్ణయం తీసుకున్నప్పుడు ముందుగా వారిని ఎక్కడ ఉంచాలి అన్న విషయాన్ని గుర్తించి తరువాత వారిని అక్కడ నుండి ఖాళీ చేయించాల్సిందని అన్నారు. వారిని కొంతమంది రాజకీయనాయకులు వాళ్ళకు అసరమైన రకరకాల పనులు చేయించుకొని ప్రస్తుతం వారిని దోషులుగా చిత్రీకరించడం ఎంతవరకు సమంజిసమని వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి అధికారులతో చర్చించి వారికి స్థలం కేటాయించాలని వారు కోరారు.గర్భిణి స్త్రీలు, చిన్నపిల్లలు, తీసుకొని వారు రకరకాల ప్రాంతాలకు తిరగడం సరైన విధానం కాదని వారు హితవు పలికారు.

## 2న బోగోలు మండల మీట్

**బిట్రగుంట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** బోగోలు మండల పరిషత్ ప్రత్యేక సర్వసభ్య సమావేశం నవంబరు 2వ తేదిన ఎంపిపి మేకల సుజాత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడివో పి.సుబ్రమణ్యం తెలిపారు. ఈ నెలలో రెండు సార్లు సమావేశం నిర్వహించాలని తేదీలు ఖరారు చేసినా కోరం లేకపోవడంతో వాయిదాపడ్డాయి. ఇటీవల గ్రామసభలో ప్రతిపాదించిన ఉపాధి హామీ పనులు చేపట్టాలంటే మండల ఆమోదం తప్పనిసరి. కాగా మండలంలోని ఎంపిటిసిలందరూ వైసిపికి చెందిన వారు కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు సయోధ్య కుదరకపోవడంతో వాయిదాపడ్డాయి.

## బుచ్చి ప్రభుత్వ వైద్యశాల నూతన కమీటి సమావేశం



**బుచ్చి అక్టోబర్ 29 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం సిహెచ్‌సి నూతన కమీటి డైరక్టర్లుగా తెలుగుదేశం నుండి దొడ్ల కోదండరామిరెడ్డి, బిజెపి నుండి రామిశెట్టి రమణమ్మ, జనసేన పార్టీ నుండి తుమ్మల ప్రసాద్, ఎంపిక కాగా డాక్టర్ పద్మజా నేతృత్వంలో నూతన కమీటి సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన డైరక్టర్లు మాట్లాడుతు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. హాస్పటల్ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తామని అన్నారు.ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## బిట్రగుంటలో ఆర్‌వోహెచ్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించిన రైల్వే అధికారులు



**బిట్రగుంట, అక్టోబరు 29 ప్రభాతవార్త :** బిట్రగుంట రైల్వే స్టేషన్ యార్డులో ఆర్‌వోహెచ్ డిపో ఏర్పాటుకు విజయవాడ రైల్వే డివిజన్ అధికారుల బృందం స్థల పరిశీలన చేసింది. కృష్ణపట్నం ఓడరేవుకు గూడ్సు రైళ్ళ ద్వారా సరుకు రవాణా క్రమేణా పెరుగుతున్న నేపధ్యంలో అందుకు అనుగుణంగా తరచు గూడ్సు వ్యాగిన్లు మరమ్మతులు కావడంతో వీటిని విజయవాడకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది, దీంతో సమయం వృధా కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడు ఎదురవుతున్నాయి. బిట్రగుంటలో దీనిని ఏర్పాటు చేయాలని సుమారు ఆరు నెలల క్రిందట 11 కోట్ల రూపాయల నిధులు మంజూరు కూడా చేశారు.ఈ క్రమంలో రైల్వే అధికారులు డిపో ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని గుర్తించే కార్యక్రమం చేపట్టడంతో పాటు యంఆర్‌వి, ఎఆర్‌టి రైళ్లను పరిశీలించడంతో పాటు వీటి నిర్వహణ కూడా బిట్రగుంటలో నిర్వహించాలని సమాలోచన చేశారు.అయితే ఆర్‌వోహెచ్ డిపో వెంకటాచలంలో ఏర్పాటు చేసే అంశాన్ని రైల్వే అధికారులు పరిశీలించగా అక్కడ ఏర్పాటు చేస్తే డిపోకు అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేయాల్సి వస్తుంది. బిట్రగుంట రైల్వే అభివృద్ధిని కాంక్షించే రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేసే ఎంపిలు, శాసనసభ్యులు దృష్టి పెడితే బిట్రగుంటలోనే ఆర్‌వోహెచ్, పివోహెచ్ ఏర్పాటై అవకాశం వుంది, మరి ఆ దిశగా ప్రయత్నం చేస్తారో, వెంకటాచలంలో రైల్వే అధికారులు మొగ్గు చూపిన స్థలంలో ఏర్పాటు చేస్తారో వేచిచూడాల్సి వుంది.

## గ్రీన్ కాకర్స్‌ను వాడి పర్యావరణాన్ని పరిరక్షించండి



**కావలి రూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** దీపావళి పర్వదినం సందర్భంగా గ్రీన్ కాకర్స్‌ను వాడి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కావలి పట్టణ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడారు.దీపావళి పండుగను ఆనందంగా, ఆరోగ్యంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. సాధారణ టపాకాయల్లో వుండే రసాయనాలు ఆరోగ్యం, పర్యావరణం రెండింటికి హానికరమన్నారు. వాటి నుండే వెలువడే నైట్రోజన్ ఆక్సైడ్‌లు, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికర వాయువులు ఊపిరితిత్తులను దెబ్బతీసి ఆస్తమా, బ్రాంకైటీస్ వంటి శ్వాసకోశ వ్యాధులను కలుగజేస్తాయని తెలిపారు. మన ఆరోగ్యం, మన పర్యావరణం మన చేతుల్లోనే వుందని వాటిని రక్షించుకోవడానికి తక్కువ హాని కలిగించే గ్రీన్ కాకర్స్‌ను ఉపయోగించాలని కోరారు. గ్రీన్ కాకర్స్‌ను గుర్తించడానికి ప్యాకెట్ మీద గ్రీన్ ఫైర్ వర్క్స్, నీరి అని రాసి వుంటుందని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ దీపాలకు బదులుగా మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు.

## పోలేరమ్మ తల్లికి పూజలు



**విడవలూరు అక్టోబర్ 29, ప్రభాతవార్త :** మండల కేంద్రం గ్రంథాలయం వీధిలో ఉన్న పోలేరమ్మ తల్లికి, పార్లపల్లి గ్రామంలో వెలసియున్న శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజ, వడమాల పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. వావిళ్ళ గ్రామంలో వెలసిన పోలేరమ్మ తల్లికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా గ్రామస్తులు వ్యవహరించారు.

## తడిపొడి విత్తన శుద్ధి తెలుసుకోవాలి ఏవో శ్రీలక్ష్మి



**కొడవలూరు (విడవలూరు), అక్టోబర్ 29, ప్రభాతవార్త :** మండలం బసవయ్యపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవ సాయ అధికారిని శ్రీ లక్ష్మి నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు విత్తనశుద్ధి చేసు కోవాలని సలహాలు, సూచనలు ఇచ్చారు. అదే విధం గా తడి విత్తన శుద్ధికి 1 కేజీ విత్తనానికి 1 గ్రాము పొడి విత్తన శుద్ధికి కేజీ విత్తనముకు 3 గ్రాములు కార్బండి జామ్ వాడుకోవాలని తెలియజేశారు. అలాగే నారుమడి, వరిలో క్రమ పద్దతిలో ఎరువులను వాడుకోవాలి అలా చేస్తే అధిక దిగుబడులు రావడం జరుగుతుందన్నారు. అనంతరం పలు చోట్ల నారుమళ్లను పరిశీలించి రైతులకు సలహా ఇచ్చారు. ప్రకృతి సిబ్బంది ప్రకృతి వ్యవసాయం యొక్క అవశ్యకత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ. అనూష, పి. వెంకట్రావు, డి. శ్రీశివజ్ఞాన్, కె. విష్ణు ప్రియ, సిఆర్‌పి రాంప్రసాద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు పొందండి



**విడవలూరు అక్టోబర్ 29, ప్రభాతవార్త :** మండలంలోని వావిళ్ళ, దంపూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల నందు బిపిటి - 5204, కెఎన్ఎం 1638 రకాల విత్తనాలు ఉన్నాయి. రైతులు వినియోగి ంచుకోవాలని తెలిపారు. అలాగే సమాచార హక్కు చట్టంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు కొమ్మి శ్రీధర్ నాయుడు, ఎంపిటిసి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## శాఖవరంలో పొలం పిలుస్తుంది



**వలేటివారిపాలెం అక్టోబరు 28, ప్రభాతవార్త :** మండలంలోని శాఖవరం కొండసముద్రం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి హేమంత్‌భరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.రబీలో సాగుచేసిన వరి,మినుము,శనగ తదితర పంటలకు బీమా చేయించు కోవాలన్నారు.పంటలవారీగా ఎకరాకు మినుముకు రూ38,వరికి రూ.168,శనగకు రూ.56,పెసరకు రూ.36, వేరుశనగకు రూ.60లు చొప్పున ప్రీమియం సంబందిత వ్యవసాయసిబ్బందికి చెల్లించాలన్నారు.కొండసముద్రం గ్రామంలోని పంటలకు చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు.గౌతమి,సురేష్,సిహెచ్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరులో రక్తదాన శిభిరం



**పొదలకూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** అమరవీరుల దినోత్సవం సందర్భంగా పొదలకూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నెల్లూరు రూరల్ డిఎస్పి జి. శ్రీనివాసరావు ఈ రక్తదాన శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని బైకు ప్రమాదాలు హెల్మెట్ లేనందు వల్లే ఎన్నో జరుగుతున్నాయని అన్నారు. రక్తదాన శిభిరాలు అవసరమని ఒకరిచ్చే రక్తం వల్ల పది మంది ప్రాణాలు నిలిపిన వారిని అవుతామని అన్నారు. మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం డ్రంక్ అండ్ డ్రైవ్ డ్రైవింగ్ లాంటివి చేయకూడదన్నారు. సిట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. పొదలకూరులోని పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సిఐ రాంబాబు, ఎస్ఐ హామీద్, వైద్యాధికారి ప్రసాద్, సామాజిక ఆరోగ్య కేంద్రంలో బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి నజ్మా సుల్తానా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు ఆర్డీఓ అనూష కుమారి



**పొదలకూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** భూముల రీ సర్వేలో జరిగిన అవకతవకలను సరి చేయడం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష్ అనూష కుమారి అన్నారు. మంగళవారం పొదలకూరు మండలంలోని మరుపూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు అర్జీల రూపంలో తీసుకొని సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. పొరపాటుగా పేర్ల నమోదు అయిన వాటిని కూడా పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు. పలువురు రైతులు అర్జీల రూపంలో వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివకృష్ణ, వీఆర్ఓ గుణశేఖర్, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు కె. ప్రభాకర్ రెడ్డి, కె. శ్రీనివాసులు రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐను కలిసిన టిడిపి నేతలు



**విడవలూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** స్థానిక సబ్ ఇన్స్పెక్టర్‌గా పి. నరేష్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఆయనను కొడవలూరు ఎస్సి సెల్ మండల మాజీ అధ్యక్షులు తువ్వర ప్రవీణ్ కుమార్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. పలు అంశాల తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు సూరి వినోద్ కుమార్, కోవూరు రమేష్, సూరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ జీఈఏకి శుభాకాంక్షలు తెలిపిన ఏపీ ఎస్ఎస్ఏ



**నెల్లూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త-వైద్యం :** ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్టాఫ్ నర్సుల సంఘం జిల్లా ఎన్నికలలో ఘన విజయం సాధించిన విషయం పాఠకులకు విధితమే. ఈ మేరకు మంగళవారం ఏపీఎస్ ఎస్ఏ సభ్యులు తమకు మద్దతు ప్రకటించి ఏపీజీఈఏ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ఏపీజీఈఏ జిల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏపీఎస్ఎస్ఏ సభ్యులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కీలకమైన పోలింగ్ కౌంటింగ్ పక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా సలహాలు, సూచనలు ఇస్తూ భరోసాగా నిలిచిన రాష్ట్ర నేతలు చొప్పా రవీంద్రబాబు, వై.రమణారెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డిలకు సభాముఖంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్టాఫ్ నర్సింగ్ ఎన్నికల్లో వారు చూపిన చైతన్యం అన్ని ఉద్యోగ వర్గాలకు స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. జిల్లా కార్యదర్శి రాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నర్సులకు ఎలాంటి ఉద్యోగ సమస్య వచ్చినా ఏపీజీఈఏ పెద్దన్నలా పరిష్కార ప్రయత్నం చేస్తుందని అన్నారు. తదుపరి ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.రమణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా ఉపాధ్యక్షులు మల్లిఖార్జున, నూతన నర్సింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని సభాపూర్వకంగా పుష్పగుచ్చాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వై.సత్యవతి, కార్యదర్శి ఎన్.వసుంధర, కార్యవర్గ సభ్యులు సుమతి, అరుణకుమారి, రాధ, లక్ష్మీ, నిర్మల జ్యోతి, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## జయపురం, పోకలవారిపల్లిలో పొలం పిలుస్తోంది




**సీతారామపురం అక్టోబర్ 29 ప్రభాతవార్త:** సీతారామపురం మండలంలోని జయపురం , పోకలవారిపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతు సాగులో ఉన్న వరి మరియు కందిపంటలను పరిశీలించి వారిలో కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు తగు సూచనలు చేశారు. కందిలో మారుకా పురుగు గుర్తించి నివారణా చర్యలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో ఏఇఒ సాంబశివయ్య, ఎహెచ్ఎ శైలేంద్ర,విఏఎ లక్ష్మీ నారాయణ, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపులు ఏర్పాటు



**వింజమూరు,అక్టోబర్29ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం షాపులు ఏర్పాటుచేస్తున్నారని ఎక్సైజ్ సిఐ జలీల్ పేర్కొన్నారు. మంగళవారం వింజమూరు పట్టణంలో ఆర్ అండ్ బి ఎఇ ఫయాజ్ తో కలసి ప్రస్తుతం షాపల నిర్వహణా ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు తాత్కాలిక పర్మిట్లతో షాపులు నడుస్తాయని, 31నుండి ప్రభుత్వ నియమనిబంధనలతో పూర్తిస్థాయిలో షాపులు ఏర్పాటవుతాయని తెలిపారు.

## విధి నిర్వహణలో అంకితభావం అవసరం



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తమ విధుల పట్ల నిర్లక్ష్య వహించకుండా కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం కోవూరు సెక్టార్ సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందిం చాలన్నారు. అదేవిధంగా ప్రతి నెలా 10వ తేది లోగా తప్పకుండా చిన్నారుల బరువు ఎత్తు తూచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈసందర్భంగా ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## పడకండ్లలో ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి

**ఆత్మకూరు,అక్టోబర్29ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం పడకండ్ల గ్రామంలో మంగళవారం ఓ యువకుడు ట్రాక్టర్‌కిందపడి మృతిచెందినట్లు ఎస్ఐ జిలానీ తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు తన వ్యవసాయ పొలంలో నెక్కం కార్తీక్ (30) పనులు చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ల కింద పడి పొలంలోనే మృతిచెందినట్లు తెలిపారు. ఈసంఘటనతో పడకండ్ల గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు పడకండ్లకు వెళ్ళి పొలంలో పడి ఉన్న కార్తీక్‌ను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు పరిష్కారం



**సైదాపురం, అక్టోబర్ 29, ప్రభాతవార్త :** పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా వ్యవసాయంపై క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు తక్షణ పరిష్కారంపై అవగాహన తెలపడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారిణి హై మావతి తెలిపారు. మండల పరిధిలో ని అనంత మడుగు గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏవో హైమావతి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖకు సంబంధించి అనుబంధ శాఖలతో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల నియంత్రణ, కలుపు నివారణ ఉల్లికోడ్, శీత్ బ్లైట్ నివారణ చర్యలపై రైతులతో చర్చించారు. అలాగే రైతులు వేసిన పంటలను పరిశీలించి ఆధునిక వ్యవసా యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ సహాయకులు శ్యాం, రాజారావు, మార్కెట్ కమిటీ శంకర్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

## సస్య రక్షణలో జీవ నియంత్రణ పద్దతులు రైతులకు మేలు



**వరికుంటపాడు,అక్టోబర్ 29,ప్రభాతవార్త :** పంటల సస్య రక్షణలో జీవ నియంత్రణ పద్దతులు రైతులకు ఎంతగానో ఉపయోగకరమనీ మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తోటలచెరువుపల్లి,జి.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు వ్యవసాయా పద్దతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల రక్షణ,అధిక దిగుబడి ల కోసం విచక్షణ రహితంగా రసాయానిక పురుగు మందులను , తెగుళ్ళ మందులు వినియోగించడం ద్వారా జీవులు వ్యాధి నిరోధకను పెంచుకొని రసాయన మందులకు కూడా లొంగకుండా పంటలకు నష్టం చేకూరుస్తాయన్నారు.వరి పంటలో తెగుళ్ళ నివారణ కొరకు సూడోమోనాస్ ఫ్లోరో సెన్స్ అనే జీవ శిలీంధ్ర నాశనని 10 గ్రాముల ఒక కేజి వరి విత్తనానికి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు.అనంతరం రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు హరినాథ్ ,శ్రీకాంత్,రైతులు పాల్గొన్నారు.

## విత్తన శుద్ధితో తెగుళ్ళు దూరం



**వింజమూరు,అక్టోబర్29ప్రభాతవార్త:** రైతులు విత్తనశుద్ధి పాటించడం వలన పంటకు తొలి దశలో సోకే తెగుళ్ళను తట్టుకునే శక్తి ఉంటుందని ఎఒ శివనాగప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చాకలికొండ , కాటేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులతో కలసి వారు సాగుచేస్తున్న వివిధ పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలకు సోకే అనేక రకాల తెగుళ్ళను దూరం చేయవచ్చన్నారు. ఆయా ప్రాంతాల్లోని సమీప రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై పంపిణీ చేసే వరివిత్తనాలను పొందాలన్నారు. చౌడు భూములపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పచ్చిరొట్ట పైర్లను చౌడు భూముల్లో సాగుచేయాలన్నారు. తెగుళ్ళను తట్టుకునే విత్తనాలను వాడాలన్నారు. మినుములో వచ్చే పేనుబంక, తెల్లదోమ తెగుళ్ళను కొత్తరకం విత్తనం అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రైతు విత్తనాల ఎంపికలో జాగ్రత్త వహించి అధిక దిగుబడులను పొందాలన్నారు. హార్టికల్చర్ ఎఒ ఎస్.కె.సాహెల్ మాట్లాడుతూ పామాయిల్, బత్తాయి సాగుచేసే రైతులకు జాతీయ గ్రామీణ ఉపాదిహామీ ద్వారా మొక్కలు నాటేందుకు అవకాశం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎఇఒ మనోహర్, విఎఎ పావని, నిఖిత, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ధన్వంత్రి జయంతి వేడుకలు



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం ధన్వంత్రి జయంతి సందర్భంగా ఆ మహనీయులు చిత్రపటానికి ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారం రోజుల పాటు ఆయుర్వేదానికి సంబంధించి ఆయుర్వేద ఆస్పత్రి సమీపంలో ఉన్న గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఆయుర్వేదంపై అవగా హన కల్పించేలా సదస్సులు నిర్వహించడమే కాకుండా ఉచిత ఆయుర్వేద వైద్యసేవలు కూడా అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ మైనుద్దీన్, స్టాఫ్ నర్సు ప్రసూన లత, ఆయుర్వేద సిబ్బంది శ్రీహరి, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

## వ్యవసాయ సలహాలు, సూచనలు పాటించాలి



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ప్రస్తుతం నారుమడుల సీజన్ ప్రారంభం అయిందని, రైతులు తప్పనిసరిగా వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి తెలిపారు. కోవూరు మండలం జమ్మిపాలెం గ్రామంలో బుధవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 సెంట్ల నారుమడి తయారు చేసేందుకు రైతులు 2 కేజీల డీఏపీ, 4 కిలోల యూరియా, 2 కిలోల పొటాష్‌ను తప్పక వాడుకో వాలన్నారు. వీటిలో యూరియా పొటాష్‌ను రెండు సార్లుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. విత్తనాల ఎంపికలో కూడా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పురుగుమందులు, రసాయనిక మందులను ఎక్కువ మోతాదులో వాడడం వలన భూ ఆరోగ్య క్షీణించి వాతావరణంలో కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రసాయనిక పురుగులకు ప్రత్యామ్నాయంగా జీవ నియంత్రణ పద్దతులు, వృక్ష సంబంధ రసాయనాలు తయారు చేసుకుని తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట దిగుబడులను సాధించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్య, వంశీ, నారాయణ, తదితరులు ఉన్నారు.

## మర్రిపాడులో మోటర్‌బైక్‌ల దొంగ అరెస్ట్



**మర్రిపాడు,అక్టోబర్29ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారి సమీపంలోని గంగుంట కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న బత్తల నవీన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాసరావ్ తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 23తేదీ సాయ ంత్రం 6 గంటల సమయంలో టివిఎస్ తార్ మోటర్‌బైక్, 80వేల రూపాయలు ఖరీదు చేసే మరొక బైక్‌ను చోరీ చేసినట్లు నవీన్ పోలీస్ విచారణలో తెలిపాడని ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని ఇసకపల్లికిచెందిన బత్తలనవీన్ వడ్డెర కులానికి చెందిన వాడన్నారు. ఇతనిపై పోలీస్‌స్టేషన్‌లో 4కేసులు నమోదు చేశామన్నారు. ఈరెండు బైక్‌ల విలు సుమారు 1.50లక్షల రూపాయలు ఉంటుందన్నారు. బత్తల నవీన్‌ను తమ సిబ్బంది ద్వారా చాకచక్యంగా పట్టుకొని రెండు బైక్‌లను రికవరీ చేసినందుకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, డియస్పీ వేణుగోపాల్, సిఐ గంగాధర్‌రావ్‌లు తమను అభినందించారని ఎస్ఐ తెలిపారు.

## కావలి కాలువకు నేడు నీరు విడుదల



**దగదర్తి, అక్టోబరు 29 ప్రభాతవార్త :** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి విజ్ఞప్తి మేరకు కావలి కాలువకు నీరు నేడు విడుదల చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి తెలిపారు. రైతులు నారుమడులు వేసుకునేందుకు కావలి కాలువకు నీరు వెంటనే విడుదల చేయాలని జిల్లా మంత్రికి, జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే దగుమాటి విజ్ఞప్తి చేశారు. వారు వెంటనే స్పందించి కావలి కాలువకు నీరు విడుదల చేయిస్తున్నారని తెలిపారు. కావలి నియోజకవర్గంలోని రైతులందరూ నారుమడులు వేసుకునేందుకు సిద్దంగా వుండాలని కోరారు.

## గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిని కలిసిన ఎమ్మెల్యే



**కావలి, అక్టోబరు 29 ప్రభాతవార్త** గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠిని గుంటూరులో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఐజికి పుష్పగుచ్చం ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వారిరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

## విద్యార్థులకు 5ఎస్ మేనేజ్మెంట్ కాన్సెప్ట్ పై శిక్షణ



**ముత్తుకూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త** కృష్ణపట్నం ఉన్నత పాఠశాలలో అదానీ ఫౌండేషన్‌తో పాటు అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ 5ఎస్ నిర్వహణ కాన్సెప్ట్ పై సోమవారం శిక్షణ నిర్వహించారు. పాఠశాలలోని 8వ తరగతి నుండి పదవ తరగతి వరకు 30మంది విద్యార్థులు శిక్షణ పొందారు. పనిచేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉంచడం గురించి తెలుసుకున్నారు. ఇది మానవ జీవిత భద్రతకు దారి తీస్తుందని కాన్సెప్ట్‌ను అనుసరించిపని ప్రదేశంలో ఏర్పాటు చేసిన వస్తువుల ద్వారా కార్యకలాపాలను నిర్వహించడంలో సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. 5ఎస్ అంటే సైరీ (ఆర్గనైజేషన్, పునర్వ్యవస్థీకరణ), సైటాన్ (నీటెన్స్), సైసో (పరిశుభ్రత), సైకెట్సు (ప్రామాణికత), షట్సుకి (క్రమశిక్షణ) కాన్సెప్ట్ అనేది ప్రాథమికంగా జపనీస్ కాన్సెప్ట్ ఇది సమయానుకూలంగా కావా ల్సిన అవుట్‌పుట్ కోసం వనరులను సముచితంగా ఉపయోగించడం కోసం కార్యాలయాన్ని నిర్వహించడం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎకెపిఎల్ ఉద్యోగులు వింగ్ కమాండర్ వివేక్ నారాయణ్, డిజిఎం ప్రాజెక్టు, హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నుండి సలీల్ శ్రీవాస్తవ, శిక్షణకు రిసోర్స్ పర్సన్‌గా ఉన్న సంద్రతో పాటు, జడ్‌పిపి ప్రధానోపాధ్యాయురాలు పి. సరళ, ఉమా అరుణ్ టి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను వేగవంతం చేయాలి :తహశీల్దార్



**కొడవలూరు (విడవలూరు), అక్టోబర్ 29, ప్రభా త వార్త** మండలంలో సాగు ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులకు ఓటు హక్కు కల్పించి ఓటరు జాబితాను వేగవంతం చేయాలని తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి వీఆర్వో, గ్రామ సర్వేయర్లకు తెలియజేశారు. త్వరలోనే నీటి సంఘాల ఎన్నికలు జరగబోతున్నాయి. వెంటనే రైతులను గుర్తించి ఓటు కలిగిన వారిని నీటి సంఘ జాబితాలో నమోదు చేయాలని తెలిపారు.

## భూమి ఒకరిది పేరు మరొకరిది రసాబస





**విడవలూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రిసర్వే ప్రాజెక్టు పేరుతో చేపట్టిన గ్రామ సభ కార్యక్రమం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రీ సర్వే గ్రామ సభ దంపూరు గ్రామంలో గందరగోళంగా నెలకొంది. రీసర్వేలో గ్రామ రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా రైతుల భూములను పేర్లు, భూమి విస్తరణం మార్చివేశారని రైతులు వీఆర్వోను నిలదీశారు. ఆధారాలు పాతపాలెం కృష్ణకు సర్వే నెంబర్లు 538/1.47 సెంట్లు భూమికి కాను 13 సెంట్లు రికార్‌లో చూపడం నెల్లూరు సుధాకర్ 565/ఏ 82 సెంట్లు భూమిని తలారి నాగమణికి రికార్డు నమోదు ఉక్క శ్రీనివాసులు 68/ఏ 1, 1.62 సెంట్లు భూమి 2023 సంవత్సరం వరకు ఉండగా 2024కి 1.35 సెంట్లు, గమనార్హం. గ్రామ సభలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని భూములు విస్తరణం అడిగి తెలుసుకోగా ప్రతి రైతుకు భూమి తక్కువగా ఉండడం మరొకరి పేర్లు పై భూమి నమోదు చేయడం, వీఆర్‌వో తీరు ఇంతేనని తహశీల్దార్ ఎదుట ఆవేదన వ్యక్తం చేసి గడచిన సంవత్సరాలలో వీఆర్వో ఏం పని చేసిందని నిలదీశారు. రాజకీయ పలుకుబడితో గ్రామ వీఆర్‌ఓగా చాలామణి చేస్తూ రైతులను ఇబ్బంది పెట్టే అధికారి ఎందుకని ఆరోపించారు. ఇది ఇలా ఉండగా వీఆర్‌ఓ కుమారుడు రికార్డులను పరిశీలించడం రైతులు ఇచ్చే ఫిర్యాదులను ఆయనే స్వయంగా స్వీకరించడం పలు అనుమానాలు వెల్లవెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దూది విజయ రాఘవన్, కొమ్మి శ్రీధర్ నాయుడు, చేవూరు రాంప్రసాద్, సర్పంచ్ సురేందర్ రెడ్డి, ఎంపిటిసి భాను ప్రకాష్, సాయి చందు, మండల సర్వేయర్ మస్తాన్ భాష, ఆర్ఐ సలీం, రీ సర్వే డిటి, గ్రామ సర్వేయర్, విజయ కుమార్, ఎన్. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చి సిహెచ్‌సి డైరక్టర్‌గా తుమ్మల ప్రసాద్



**బుచ్చి అక్టోబర్ 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం సిహెచ్‌సి డైరక్టర్‌గా జనసేన నాయకులు తుమ్మల ప్రసాద్‌ను నియమంచడం అభినందనీయమని జ మండల పార్టీ అధ్యక్షులు మాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. హాస్పటల్ అభివృద్ధికి కమీటి మెంబర్లు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఆయన కోరారు. హాస్పటల్ కమీటి డైరక్టర్లుగా ఎంపికైనదొడ్లకోదండరామిరెడ్డికి, బిజెపి నాయకులు రామిశెట్టి రమణమ్మకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

## పారిశుద్ధ్య పనులు పరిశీలించిన హెల్త్ ఆఫీసర్



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం స్థానిక 17వ డివిజన్ ముత్తుకూరు రోడ్డు, 45 వ డివిజన్ మినీ బైపాస్ రోడ్డు, రంగనాయకుల పేట గేట్ సెంటర్, 53,54 డివిజన్ల వెంకటేశ్వరపురం ఫ్లై ఓవర్, 15 డివిజన్ బాలాజీ నగర్ అన్నపూర్ణ అపార్ట్మెంట్, 16 డివిజన్ బఫెలో స్ట్రీట్ లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతన్న రోడ్ల పరిశుభ్రతలో భాగంగా డివైడర్ల వద్ద మట్టి తొలగించటం, రోడ్ల అంచున మట్టి, బ్లాక్ స్పాట్ వద్ద చెత్త తొలగించుట, డ్రైను కాలువల పూడికతీత వంటి తదితర పనులను పర్యవేక్షించారు. ఈయన వెంట హెల్త్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు కోదండరామయ్య ఎంపిక



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** నెల్లూరులోని ఏసీ స్టేడియంలో 29వ తేది జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీఎస్ క్యారమ్స్ సమక్షంలో కోవూరు మండలం పడుగుపాడు నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న జి. కోదండరామయ్య పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 7వ తేదిన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు కోదండరామయ్య పాల్గొనాల్సి ఉంది. జిల్లాలో ఈ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కోదండ రామయ్యను మండల విద్యాశాఖ అధికారులు, సహచర ఉపాధ్యాయులు , మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

## రోబోటిక్స్ వర్క్‌షాప్‌లో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు జేఎన్‌టీయూ పులివెందులలో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ఆన్ ఐఒటీ విత్ హ్యూమన్ ఆయిడ్ రోబో అనే వర్క్‌షాప్‌లో పాల్గొని విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ మేరకు కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన కె. రాజా, ఓ. ప్రతాప్ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్నారని, జేఎన్‌టీయూ పులివెందుల నిర్వహించిన యంత్ర 2కే24 వర్క్‌షాప్‌లో తమ సాంకేతిక పరిణామాలు పొందు పరిచి మొదటి, రెండవ బహుమతులను కైవసం చేసుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికి తీసిన మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. పద్మ శ్రావ్య, డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి వై. మురళీకృష్ణలను ఈ సందర్భంగా అభినందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో క్లాస్ ఇన్‌చార్జి జి. నీలిమ, తదితరులు ఉన్నారు.

## రైతుల వివరాలు త్వరితగతిన అందజేయాలి



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** పడుగుపాడు సహకార పరపతి సంఘంకు సంబంధించి సభ్యులుగా ఉన్న రైతులుకు సంబంధించిన సమగ్ర వివరాలు త్వరితగతిన అందజేసేలా గ్రామ రెవెన్యూ అధికారులు తగు చొరవ తీసుకోవాలని పడుగుపాడు సహకార పరపతి సంఘంకు సంబంధించి తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల వారీగా తమ సొసైటీలో సభ్యులుగా ఉన్న వారి సమాచారం సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు ఇవ్వడం జరిగిందని, ఆ వివరాలను వారు నిశితంగా పరిశీలించి నివేదికను ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## అండర్-19 బాక్సింగ్ పోటీల్లో జేబీఆర్ విద్యార్థుల ప్రతిభ

### - రెండు రజత పతకాలు కైవసం



**కోవూరు, అక్టోబర్ 29 ప్రభాతవార్త :** కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వం ఉన్నత పాఠశాలకు చెందిన పి. వెంకట మనోజ్, కె. విజయ జశ్వంత్‌లు ఈ నెల 27,28,29 తేదీల్లో విజయ వాడలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి 81 కేజీ విభాగంలో కె. విజయ జశ్వంత్ రజత పతకం, 91 కేజీ విభాగంలో పి. వెంకట మనోజ్‌లు రజత పతకాలు సాధించిన తమ పాఠశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి తెలిపారు. పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా వారికి పలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. పాఠశాల పీఈటీ సాయితేజ వారిరువురిలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేలా దృష్టి పెట్టారని, ఇందుకు వారిరువురిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

## హైకోర్టు బార్ కౌన్సిల్ సెక్రటరీ పద్మలతను కలిసిన సాయిప్రసాద్



**కావలి రూరల్, అక్టోబరు 29 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ కౌన్సిల్ సెక్రటరీ ఎన్. పద్మలతను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, కావలి పట్టణ న్యాయవాది ఐ. సాయి ప్రసాద్ మంగళవారం అమరావతిలోని హైకో ర్టులో మర్యాదపూ ర్వకంగా కలిశా రు. ఆమెతో ఆయన పలు విష యాలపై చర్చించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ అడ్వకేట్ వెల్ఫేర్ స్టాంప్‌లు అన్ని బార్ అసోసియేష న్లకు త్వరితగతిన సరఫరా చేసి కొరత లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్ర మంలో న్యాయవాదులుఎ. ఎస్. నరసింహారావు పాల్గొన్నారు

## రీ సర్వే గ్రామ సభలో అర్జీలు వెల్లువ

**విడవలూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త** మండలంలో దంపూరు గ్రామంలో జరిగిన రీ సర్వే గ్రామ సభ మంగళవారం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు రైతులు వందల సంఖ్యలో పాల్గొని రీ సర్వే జరిగినప్పటి నుండి భూ సమస్యలు ఉన్నాయని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 41 అర్జీలు రావడం జరిగింది. వాటిని పరిశీలించి సాధ్యమైనంతవరకు పరిష్కరిస్తాం లేదంటే పై అధికారులకు పూర్తి నివేదిక పంపి తదుపరి పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మండల అధికారులు సాయి చందు, సలీం, మస్తాన్ భాష, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏబీఎం సంస్థల అధినేత డాక్టర్ జీడీడీ దివాకర్ దంపతులు





**గుడ్లూరు, అక్టోబర్ 29 ,ప్రభాతవార్త** మండలంలోని సాలిపేట పంచాయతీలో గల ఏబీఎం కాంపౌండ్ నందు గల చర్చిలో క్షేత్ర పాల్-సుమతి దంపతుల పుత్రుడు మెత్తాళ్ల కౌశిక్-ప్రీతిల వివాహం మంగళవారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీఎం సంస్థల అధినేత డాక్టర్ దివాకర్ దంపతులు హాజరయ్యారు. నూతన వధూవరులను దివాకర్ దంపతులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కౌశిక్-ప్రీతిల నూతన దంపతులకు బుల్లెట్‌ను బహుమతిగా అందజేశారు. ఈ వివాహ మహోత్సవానికి మండలంలోని పలు గ్రామాల నాయకులు, కావాలికి చెందిన పలువురు ప్రము ఖులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌ని అరికడదాం

### - నెల రోజులు ఉచిత స్ట్రోక్ శిబిరం మెడికవర్‌లో



**నెల్లూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త-వైద్యం** జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులతో ఉరుకులు, పరుగుల ఒత్తిడిలతో తెచ్చుకుంటున్న బ్రెయిన్ స్ట్రోక్స్‌ని అరికడదామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి న్యూరాలజిస్టు డాక్టర్ దీక్షాంతినారాయణ్, న్యూరో సర్జన్ డాక్టర్ దినేష్ తెలిపారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగలవారం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ట్రోక్ కేసులు 30 ఏళ్లలోని వారికి సైతం రావడం బాధాకరమన్నారు. మూతి వంకరపోయినా, చేయి చచ్చు అనిపించినా, కళ్లు సరిగా కనపడకపోయినా, మాటలు తడపడినా, తూలిపడబోతున్నా స్టోక్ లక్షణాలుగా భావించి తక్షణమే సమీపంలోని డాక్టర్ వద్దకు వెళ్లాలన్నారు. అప్పుడు ప్రమాదం తప్పుతుందన్నారు. అధిక ఒత్తిడి, బీపీ, షుగర్ నియంత్రణలో లేకపోవడం దూమపానం, మద్యపానం, జంక్‌ఫుడ్స్ స్ట్రోక్ రావడానికి ప్రధాన కారణాలు అన్నారు. అందువల్ల వీటిని మానేసి మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలన్నారు. అలాగే క్రీడలు స్ట్రోక్‌ను నియంత్రించడంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆటలు, క్రీడలు అలవాటు చేసుకోవాలన్నారు. ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ దినోత్సవాన్ని పురష్కరించుకుని నవంబర్ నెలాఖరుల వరకు ఉచిత స్ట్రోక్ క్లినిక్‌ను తమ ఆసుపత్రిలో ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉచిత కన్సల్టేషన్‌తో పాటు పరీక్షలపై 50 శాతం ఆయితీ కల్పిస్తున్నామన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మెడికవర్ ఆసుపత్రి న్యూరాలజిస్టు డాక్టర్ వైష్ణవి, సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్, క్యాన్సర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఆర్ఓడబ్ల్యూఎస్ ఏర్పాటు



**అక్టోబరు29 ప్రభాతవార్త-విద్య** ఆర్టీసీలో సుదీర్ఘకాలం పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమావేశం మంగళవారం నగరంలోని స్థానిక ఆర్టీసీప్రధాన బస్టాం డులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఈడి శేషగి రిరావు, రిటైర్ చీఫ్ ఇంజనీర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధికారి జగదీష్‌బాబు, రిటైర్డ్ ఈఈ ప్రభాకర్‌రెడ్డిలు పాల్గొని మాట్లాడారు. గతంలో తాము ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లు సభ్యులుగా ఉండి వివిధ దించటం జరిగిందన్నారు. విశ్రాంత ఉద్యోగుల హక్కులు సాధన కోసం తా ము ప్రస్తుతం రిటైర్డ్ ఆర్టీసీ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటుచేసేందుకు సన్నాహ కాలు చేస్తున్నామన్నారు. మరో వారం రోజుల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయనున్నామన్నారు. విశ్రాంత ఆర్టీసీ డిపో మేనేజర్లు, గిడుగు వెంకటేశ్వ రావు, బి సతీరాం, టివి. సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో ఎండీ సునీల్ కుమార్‌కు జనసేన నేతల ఘనస్వాగతం



**నెల్లూరు, అక్టోబరు29 ప్రభాతవార్త-విద్య** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో ఎండీ సునీ ల్ కుమార్ మంగళవారం నెల్లూరు నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనెమల్లిఖార్జున్ యాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎండీకి పుష్పగుచ్చాలు అందించి ఘనస్వాగతం పలి కారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతు టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సారధ్యంలో రాష్ట్ర ంలోని పేదలందరికి టిడ్కో ఇళ్లు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. పేదల అభ్యునతి కోసం ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తుం దన్నారు. ఇటువంటి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేదని కోనియాడారు. గడి చిన నాలుగునెలల కాలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభు త్వం చేపటి ్టందన్నారు. నూనెమల్లిఖార్జున యాదవ్ మాట్లాడుతు తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సూచనలతో జిల్లాలోఅనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సభ్యత్వ నమోదును సమర్ధ వంతంగా నిర్వహించామని గుర్తుచేశారు. పేదలకు ఇండ్లు వచ్చేల చేసేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు జమీర్, రవి, కృష్ణారెడ్డి, శ్రీరామ్, సుందరరామిరెడ్డి, నాగరత్నమ్మ, మంచికంటి శ్యామ్, కస్తూరి, నందిని, ప్రసాద్, గుర్రం కిషోర్‌బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా కార్యాలయంలో నాగబాబు జన్మదిన వేడుకలు** :నగరంలోని స్థానిక జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనెమల్లిఖార్జున యాదవ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను కట్‌చేసి వారి ఆనందాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నూనె మాట్లాడుతు నాగబాబు నిండు నూరేళ్ల సంతోషంగా ఉంటూ ఇటువంటి వేడుకలను మరిన్ని జరుపుకోవాలని కోరారు. నాయకులు గుర్రం కిషోర్‌బాబు, శ్రీరాం, రవి, కృష్ణారెడ్డి, శ్రీను, నందిని, ప్రసాద్, రామిరెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, అక్టోబర్29 ప్రభాతవార్త** : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## నారాయణలో విజయవంతంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్



**నెల్లూరు, అక్టోబర్ 29, ప్రభాతవార్త-వైద్యం** కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన మహిళకు విజయవంతంగా కాన్పు చేసిన ఘనత నారాయణ హాస్పిటల్ వైద్య బృందానికి దక్కుతుందని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ బి. హరిప్రసాద్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత పద్నాలుగు సంవత్సరాలుగా 120 కిడ్నీ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించామని, అయితే కిడ్నీ మార్పిడి ఆపరేషన్ అయిన తరువాత తండ్రులు కావడం సహజమని, కిడ్నీ మార్పిడి చేయించుకున్న మహిళలు గర్భం దాల్చడమనేది చాలా అరుదుగా జరుగుతుందని, రాయలసీమ పరిసర జిల్లాల్లో ఇదే మొదటిదన్నారు. మహిళకు పూర్తి నెలలు నిండే వరకు కాపాడి ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా మాతృత్వాన్ని అందించిన ఘనత నారాయణ హాస్పిటల్ వైద్య బృందానికే దక్కుతుందని అన్నారు. నెఫ్రాలజిస్టు డాక్టర్ కొల్లా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సాధారణంగా కిడ్నీ వ్యాధితో బాధపడే వారు క్రియాటిన్ లెవల్స్ ఎక్కువ ఉన్న వారు గర్భం దాల్చడమనేది అసాధ్యమన్నారు. అయితే ఈ అమ్మాయి 10 ఏళ్ల క్రితం కిడ్నీ సమస్యతో సంప్రదించడం జరిగిందని, కొంత కాలం డయాలసిస్ చేసిన తరువాత ఆమె తల్లి కిడ్నీ దానం ఇవ్వడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. తరువాత ఒకటి రెండు సార్లు ఇన్ఫెక్షన్ రావడం, తగ్గకపోవడం జరిగిందని, రెండు సంవత్సరాల క్రితం ఆమె తల్లిదండ్రులు అమ్మాయికి పెళ్లి చేయ్యొచ్చా అనే సందేహంతో రావడం జరిగిందని, పెళ్లి చేయ్యొచ్చు కానీ ప్రెగ్నెన్సీ విషయంలో ఉన్న రిస్క్ గురించి తెలియజేయడం జరిగిందన్నారు. అయితే మొదటి ప్రెగ్నెన్సీ బీపీ మెడికేషన్ వలన తీసివేయాల్సి వచ్చిందని, కానీ తరువాత ప్రణాళికబద్ధంగా 4వ నెల నుంచి గైనకాలజిస్టు, నెఫ్రాలజిస్టు పర్యవేక్షణలో 9 నెలల పాటు కాపాడటం జరిగిందని, ఈ తొమ్మిది నెలలలో వచ్చిన అనేక రకాల సమస్యలను అందరి వైద్యుల సహకారంతో అధిగమించడం జరిగిందన్నారు. గైనకాలజిస్టు డాక్టర్ శ్వేత మాట్లాడుతూ సాధారణంగా కిడ్నీ సమస్యకు మెడికేషన్లో ఉండటం వలన గర్భం దాల్చడమనేది కష్టమని, ఒక వేళ గర్భందాల్చినా ఎక్కువగా అబార్షన్ అయ్యే అవకాశాలు ఉంటాయని, నెలలు నిండక ముందే డెలివరీ చేయాల్సి వస్తుందని, పుట్టిన బిడ్డ ఏదో ఒక లోపంతో పుట్టే అవకాశాలు ఉంటాయని తెలిపారు. బీపీ, షుగర్లను నియంత్రణలో ఉంచి, రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేస్తూ, పూర్తి నెలలు నిండిన తరువాత అనస్థీషియా బృందం సహకారంతో విజయవంతంగా కాన్పు చేయడం జరిగిందని తెలిపారు .ఈ కార్యక్రమంలో నియోనెటాలజిస్టు డాక్టర్ గోకుల్ కృష్ణన్; అనస్థీషియా వైద్యులు చరణ్, డాక్టర్ దీప్తి, నారాయణ, హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి లో మెగా రక్తదాన శిబిరం



**ఉదయగిరి, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరి లోని పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ వెంకట్రావు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు పట్టణానికి చెందిన నోబల్ సంస్థ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సీఐ వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా సంవత్సరంలో ఒక్కసారైనా తమ రక్తాన్ని దానం చేయాలని అలాంటి కార్యక్రమాల వలన ఎంతోమంది ప్రాణాలను నిలబెట్టిన వారవుతారని అన్నారు. రక్తం దానం చేయడం వలన మనిషికి ఎలాంటి అపాయం లేదని మరల శరీరం లో తనకు తానుగా రక్తం వృద్ధి అవుతుందని అన్నారు. అక్టోబర్ 29వ తేదీన పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలవచ్చి రక్తాన్ని దానం చేసిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దాదాపుగా 80 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీస్ అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రక్తదాన శిబిరం వద్ద తన సిబ్బందితో కలిసి అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరిని పలకరిస్తూ రక్తదాన శిబిరం కార్యక్రమం విజయవంతం అవ్వడానికి శాయశక్తుల కృషి చేసిన సీఐ వెంకట్రావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీతారామపురం దుత్తలూరు పరికుంటపాడు స్టేషన్లకు చెందిన ఎస్సైలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా కొణిదల నాగబాబు జన్మదిన వేడుకలు



**నెల్లూరు, అక్టోబరు29 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మెగాబ్రదర్ కొణిదల నాగబాబుజన్మదిన వేడుకలను మంగళవారం నగరంలోని స్థానిక ఏసీనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఆ పార్టీ వీరమహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పార్టీ నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పాల్గొని కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మెగా అభిమానులకు, జనసేన నేతలకు మధ్య వారధిగా ఉంటూ అనీ తానై చూసుకునే కొణిధల నాగబాబు ఇటువంటి పుట్టిన రోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. మరిన్ని చిత్రాల్లో నటించి ప్రేక్షకులను రంజింపచేయ్యాలని కోరారు. నాగబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సభ్యులు సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీరాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుందరరామిరెడ్డి, కోలా విజయలక్ష్మీ, నాయకులు షేక్. ఆలియా, అజయ్‌బాబు, కృష్ణవేణి, శ్రీకాంత్, సుల్తాన్, మనోజ్, రిము, శాంతికల, రేవతి, ఇందిరా, హసీనా, హ రీష్, శ్రీను, షఫీ, షకీల్, తదితరులు పాల్గొన్నారు.